క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి ఘనంగా క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అలాగే కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసి పూజ నిర్వహించనున్నామని చెప్పారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులరెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తైనాలకు వాసుపల్లి పరామర్శ



తైనాల విజయ్‌కుమార్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు తైనాల విజయ్‌కుమార్‌ను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. తైనాల నివాసంలో చోరీ జరిగిన నేపథ్యంలో ఆయన్ను కలిసిన వాసుపల్లి, ఘటన గురించి వివరాలడిగి తెలుసుకున్నారు. తైనాల భార్య ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఘటనపై పోలీసులు తక్షణం విచారణ జరిపి, నిందితుల నుంచి సొత్తు రికవరీ చేయాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తైనాలను పరామర్శించిన వారిలో వాసుపల్లితో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



సంస్థలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీవత్సవ్, తదితరులు

జగదాంబ/దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పుట్టినరోజు సందర్భంగా స్వామి వివేకానంద సంస్థలో వృద్ధులకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ముందుగా చిన్నారులతో కలసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుర్గారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ద్రోణంరాజు శ్రీవత్సవ్‌కు స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు అభినందనలు తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తల్లీకొడుకులు అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం కప్పరాడలో నివసిస్తున్న మూల ధర్మారావుకు భార్య రమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు ఫాల్గుణ్ పుట్టిన రోజు కోసం దుస్తులు కొనడానికి భర్త దగ్గర రూ.1,000 తీసుకుని చిన్న కుమారుడితో కలిసి ఈ నెల 20న భార్య రమ బయటకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భర్త ధర్మారావు చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద అంతటా వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశా రు. హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మీయ సమావేశాలతో ప్రచారం



వైఎస్సార్ సీపీలో చేరిన యువకులతో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



కుల సంఘాల పెద్దలతో సమావేశంలో వాసుపల్లి గణేష్‌కుమార్

- ప్రజలకు అండగా వుంటానని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ భరోసా

దాబాగార్డెన్స్ : మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు నియోజకవర్గ ప్రజలు ఆశీర్వచనాలు అందిస్తున్నారు. జీవీఎంసీ 38వ వార్డులో శుక్రవారం వాసుపల్లి పర్యటించారు. వార్డులో గల కుల పెద్దలతో ఆత్మీయ సమావేశమయ్యారు. ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యంగా వార్డులో గల స్వర్ణకారుల పెద్దలు, విశ్వబ్రాహ్మణుల కుల పెద్దలతో కాసేపు ముచ్చటించారు. పర్యటనలో స్థానికులు అడుగడుగున ఆశీర్వచనలు అందజేశారు. పలువురు సంఘ పెద్దలు వాసుపల్లిని సత్కరించారు. ఎమ్మెల్యేగా చేసిన సేవలు మర్చిపోలేనివని, మీలాంటి నాయకుడు పాతనగరం దక్షిణ నియోజకవర్గానికి చాలా అవసరమని విశ్వబ్రాహ్మణ పెద్దలు తెలిపారు. మరలా వాసుపల్లినే అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని భరోసానిచ్చారు. దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని, మీరు ఎమ్మెల్యేగా కాకుండా మంత్రిగా రావాలని కుల పెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో 38వ వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి 50 మంది యువకులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 39వ వార్డుకి చెందిన 50 మంది యువకులు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం, పార్టీ మైనార్టీ విభాగం నాయకుడు ముజీబ్‌ఖాన్ నేతృత్వంలో వీరంతా శుక్రవారం ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లో గల వాసుపల్లి కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ వాసుపల్లి పార్టీ కండువా వేశారు. గణేష్‌కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలు, నాయకత్వ లక్షణాలు, జగనన్న అందిస్తున్న సంక్షేమ ఫలాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. వాసుపల్లి గణేష్‌కుమార్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని మంత్రిగా చూడాలన్నదే తమ ఆశయమని పేర్కొన్నారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ యువతకు అండగా ఉంటామని, జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎటువంటి కష్టం వచ్చినా అందరికీ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

ఏవీఎన్‌లో ఎన్‌సీసీ 13(ఏ) బెటాలియన్ కార్యాలయం



లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్‌తో ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు తదితరులు

దాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ కళాశాలలో 13(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ నూతన కార్యాలయం శుక్రవారం ప్రారంభమైంది. 13(ఏ) బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ పాల్గొని, కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్యాడెట్లు మరింత క్రమశిక్షణతో మెలగాలని, కళాశాలకు, ఎన్‌సీసీ విభాగానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు మాట్లాడుతూ క్యాడెట్లు మరిన్ని క్యాంపుల్లో పాల్గొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. నూతన కార్యాలయాన్ని ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఏజీబీ శంకర్ నేతృత్వంలో క్యాడెట్లు చక్కగా ఆధునీకరించడంపై అభినందించారు. నీరజ్‌కుమార్ కళాశాలలోని జువాలజీ మ్యూజియం, ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం, పలు విభాగాలను సందర్శించి, కళాశాలకు అవసరమైన సహాయాన్ని ఎన్‌సీసీ తరపున చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, ఇతర కళాశాలల ఎన్‌సీసీ సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు.

సదస్సులతో మానసిక వికాసం



అతిథులతో సదస్సు కన్వీనర్లు, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సైకాలజీ, కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ×మనస్తత్వశాస్త్రం – వ్యాపార నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న పోకడలు₹పై శుక్రవారం నిర్వహించిన జాతీయ సదస్సుకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. సదస్సుకు అతిథులుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆంధ్ర వైద్య కళాశాల సైకియాట్రిస్ట్, ప్రభుత్వ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ కె.రామిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సమాజంలో జ్ఞానాన్ని ప్రయోగాత్మకంగా అన్వయించినపుడే పరిశోధనల్లో మెరుగుదల కనిపిస్తుందన్నారు. ఆచార్య డాక్టర్ కె.రామిరెడ్డి మాట్లాడుతూ మానసిక వికాసానికి సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. సెయింట్ జోసెఫ్ సేవా కార్యక్రమాలు, అనాథ, వృద్ధాశ్రమాలకు అందిస్తున్న చేయూత ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ డి.రాజ్యలక్ష్మి, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.జ్యోతి, ఆర్.పావని, డాక్టర్ రూపా సెల్వరాజ్, డాక్టర్ జాన్‌పాల్ రాజ్, డాక్టర్ విజయ శ్రీనివాస్, పి.వీరభద్రస్వామి, హేమ, రజిని, హదసా, పావని, ప్రత్యూష, డాక్టర్ అరుణ, డాక్టర్ సుధ, పీఆర్‌వో, హిందీ విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కలాసీ ఆత్మహత్య



పోర్టు పరిపాలనా భవనం వద్ద ఆందోళన చేస్తున్న కలాసీలు

జగదాంబ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ కలాసీ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి హార్బర్ స్టేషన్ పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డి కంచరపాలెంకు చెందిన టీఎస్ నాయుడు (45) పోర్టులో టీఎల్‌బీ టాప్ లేబర్ బోర్డులో పూల్ కలాసీగా పనిచేస్తున్నాడు. అయితే వచ్చిన జీతం చాలకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారడంతో శుక్రవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈయనకు భార్య సూర్యకాంతం, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హార్బర్ పోలీసులు తెలిపారు.

పోర్టు ఎదుట కలాసీల ధర్నా

పోర్టు పరిపాలనా భవనం వద్ద పూల్ కలాసీలు శుక్రవారం ధర్నా చేశారు. పోర్టులో పని చేస్తున్న నాయుడు అనే కలాసీ విధులు నిర్వహిస్తూ టీఎం కార్యాలయం వద్ద ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో ధర్నా చేపట్టినట్టు కలాసీలు తెలిపారు. పోర్టులో చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకొస్తున్నామని, అప్పులు చేసుకుని బతకాల్సి వస్తోందని వాపోయారు. అప్పుల బాధ తాళలేక నాయుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఇప్పటికైనా పోర్టు మేనేజ్‌మెంట్ పూల్ కలాసీలకు భద్రత కల్పించి, ఆత్మహత్యలు నివారించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఉక్కునగరం: రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ వి. శ్రీనివాసరావు సూచించారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన స్టీల్‌ప్లాంట్ పరిధిలోని పలు కూడళ్ల వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా ఇతరుల అకౌంట్ల నుంచి నగదును దోచుకుంటున్నారన్నారు. ప్రతీ రోజు కోట్లాది రూపాయలు సైబర్ నేరగాళ్ల జేబులోకి వెళ్తున్నాయన్నారు. సుమారు 20 రకాల ఆన్‌లైన్ దొంగతనాలు జరుగుతున్నాయని వివరించారు. తెలియని యాప్‌లు, లింక్‌లను క్లిక్ చేయరాదని తెలిపారు. అనుమానం వచ్చిన ఫోన్ నంబర్లను ఎత్తవద్దని చెప్పారు. తెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, ఓటీపీలు, ఏటీఎం పిన్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు వివరాలు తెలపరాదన్నారు. రివార్డులను ఆశగా చూపేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానం ఉన్న వ్యాపార లింక్‌లను తెరు/వరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేసి పోటీలు ప్రారంభిస్తున్న గంట్ల శ్రీనుబాబు

మహారాణిపేట : విశాఖ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు ప్రారంభించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడా పోటీల వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. జర్నలిస్టులకు తన వంతు సహకారం ఎప్పుడూ వుంటుందన్నారు. జెసాప్ సంయుక్త కార్యదర్శి వాల్మీకి నాగరాజు, విశాఖ జర్నలిస్టుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రామకష్ణ, కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

23 నుంచి వుమెన్ కార్డియాక్ కేర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుజాత

దాబాగార్డెన్స్ : వుమెన్ ఇన్ కార్డియాలజీ అండ్ రిలేటెడ్ సైన్సెస్‌పై ఈ నెల 23, 24న విశాఖలో 16వ వుమెన్ కార్డియాక్ కేర్ – 2024 నిర్వహించనున్నట్టు వుమెన్ ఇన్ కార్డియాలజీ అండ్ రిలేటెడ్ సైన్సెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుజాత విప్పర్ల తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా విశాఖపట్నంలో నిర్వహించనున్న సదస్సులో భారతదేశం, విదేశాల నుంచి ప్రఖ్యాత మహిళా కార్డియాలజిస్టులు, పరిశోధకులు పాల్గొని సంచలనాత్మక పరిశోధనలు అందించనున్నారన్నారు. విస్కార్స్‌ను రిటైర్డ్ కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోత్స్న ప్రారంభించారని, ఈ కాన్ఫరెన్స్ మహిళా కార్డియాలజిస్టులకు మంచి వేదిక కానుందని పేర్కొన్నారు.

'వీరుల త్యాగం.. వృథా కానివ్వం'



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: 'విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. నాటి వీరుల త్యాగాన్ని వృథా కానివ్వమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1135వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఎందరో మహనీయులు ప్రాణాలను సైతం ధారపోశారన్నారు. ఎంతోమంది భూములను ధారాదత్తం చేశారన్నారు. నాటి త్యాగధనుల స్ఫూర్తితో, చెదరని సంకల్పంతో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రధాని మోదీ ప్రకటించేవరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో అడవులు కీలకం



మొక్క నాటుతున్న గంగవరం పోర్టు ప్రతినిధులు

పెదగంట్యాడ: వాతావరణంలో వచ్చే మార్పులు, జీవవైవిధ్యంలో వస్తున్న నష్టాలను అధిగమించాలంటే అడవులను పరిరక్షించాలని గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు అన్నారు. అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందులో భాగంగా అదానీ గ్రూప్ 100 మిలియన్ ప్లాంటేషన్‌లో భాగంగా గంగవరం పోర్టు ఇప్పటి వరకూ 2 లక్షల మొక్కల నాటే కార్యక్రమాన్ని పూర్తి చేసిందని వివరించారు. ఈ మొక్కలను పోర్టులోని నర్సరీ నుంచి తీసుకువచ్చామన్నారు. చెట్లను రక్షించేందుకు, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నాయని చెప్పారు. అనంతరం పోర్టు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ దివ్యగౌతమి

కంచరపాలెం: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 47వ వార్డు కప్పరాడ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'క్షయ వ్యాధిని మనం అంతమొందించగలం' అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీని వైద్యాధికారి డాక్టర్ దివ్యగౌతమీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ వ్యాధిపై ప్రజలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. ముందుగా ర్యాలీ నిర్వహించి రాంజీ ఎస్టేట్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దొరబాబు, హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, ఎస్‌టీఎల్‌ఎస్ శరత్, టీబీహెచ్‌వీ ఎన్.పైడిరాజు, హెచ్‌వీ భారతి, టీబీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

- ఒకేసారి బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ
- సకాలంలో చెల్లింపులతో రాయితీ
- ఈ నెల 31తో ముగియనున్న గడువు
- సిబ్బంది ముమ్మర ప్రచారం

జీవీఎంసీ జోన్-4లో అసెస్‌మెంట్ల వివరాలు

మొత్తం అసెస్‌మెంట్లు	50,827
మొత్తం బకాయి వసూలు చేయాల్సిన నగదు	రూ.57,57,70,000
వసూలు చేసిన రుసుం	రూ.37,06,28,000
2023-24లో వసూలు చేయాల్సిన నగదు	రూ.45,22,10,000
ఈ ఏడాది ఇప్పటి వరకు వసూలైన రుసుం	రూ.34,87,03,000



పన్ను వసూలు చేస్తున్న రెవెన్యూ అధికారులు, సెక్రటరీలు



వడ్డీ మాఫీపై ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న జీవీఎంసీ రెవెన్యూ సెక్రటరీ

జగదాంబ: ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో పన్నుల వసూలు కోసం జీవీఎంసీ యంత్రాంగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. డిఫాల్టర్ లిస్టు ప్రకారం వార్డులో సచివాలయాల వారీగా అడ్మిన్‌లు, కార్యదర్శులు పన్ను సకాలంలో చెల్లించాలని ఇంటింటికీ వెళ్లి ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం చేస్తున్నారు. ఎప్పటి నుంచి ఎంత మొత్తంలో చెల్లించాలి, గడువు, తేదీ, వడ్డీ మాఫీ తదితర విషయాలను తెలియజేస్తున్నారు. ప్రతీ వార్డులో రెవెన్యూ సెక్రటరీలు ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఈ నెల 31లోగా ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాలు, ట్రేడ్ లైసెన్స్‌లు, వ్యాపార సముదాయాల పన్నులు చెల్లించి జీవీఎంసీకి సహకరించాలని జోనల్ అధికారులు కోరుతున్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాలపై వడ్డీ రాయితీ

ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఈ నెల 31లోగా ఒకేసారి చెల్లిస్తే వాటిపై విధించిన వడ్డీ మాఫీ చేస్తున్నట్టు జీవీఎంసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఈ నెల 31 వరకు ప్రజలకు వడ్డీ రాయితీ వర్తిస్తుంది. ఎన్నేళ్లు పన్ను బకాయి ఉన్నా అంతా ఒకేసారి చెల్లించి, వడ్డీ మాఫీ సౌలభ్యం పొందవచ్చు. గతంలో కరోనా ప్రభావంతో మూడేళ్లు పన్ను చెల్లించని వారికి వడ్డీ లేని రాయితీ ఊరటనిచ్చేలా ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది.

పన్ను చెల్లింపు కేంద్రాలు

జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ఉన్న సౌకర్యం కేంద్రాల్లో పన్నులు చెల్లించవచ్చు. వార్డుల్లోని సచివాలయల్లో కూడా చెల్లించే సదుపాయాన్ని జీవీఎంసీ ఏర్పాటు చేసింది. ఇంటి నుంచి అయితే ఆన్‌లైన్‌లో చెల్లించే సౌకర్యం కల్పించారు. నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించడానికి సీడీఎంఏ పోర్టల్‌లో visakhapatnam emunicipal. ap. gov. in వెబ్‌సైట్ ద్వారా పన్నులు చెల్లించుకోవచ్చు.

సకాలంలో పన్నులు చెల్లించండి



ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి రాయితీని పొందవచ్చు. ఈ నెల 31వ వరకు జీవీఎంసీ ఈ అవకాశం కల్పిస్తోంది. పాత అసెస్‌మెంట్లు, రూ.లక్షల్లో పేరుకుపోయిన బకాయిలకు సంబంధించి యజమానులను కలిసి నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని కార్యదర్శుల ద్వారా తెలియపరుస్తున్నాం. జోన్ పరిధిలో ఉన్న పెద్ద పన్ను దారులకు ఈ అవకాశం బాగా ఉపయోగపడుతుంది. నెలాఖరులోగా లక్ష్యాన్ని సాధించడానికి సిబ్బందితో కలిసి కృషి చేస్తున్నాం.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, జోన్–4 కమిషనర్, జీవీఎంసీ

కో–ఆపరేటివ్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్ సభ్యుల షేర్ క్యాపిటల్‌పై 6 శాతం వడ్డీ ఇవ్వనున్నామని కో–ఆపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం ప్రకటించింది. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కో–ఆపరేటివ్ స్టోర్స్ 57వ మహాజన సభలో అధ్యక్షుడు బి.టి. జగదీశ్వరరావు మాట్లాడారు. స్టోర్స్ ప్రస్తుతం 14,283 సభ్యులతో రూ.కోటి 22 లక్షల మూలధనం కలిగి నెలకు రూ.7 కోట్లు వ్యాపారం చేస్తోందన్నారు. ఉక్కునగరం పాఠశాలల్లో యూనిఫాం, నోట్ బుక్స్ అమ్మకాలు చేయడానికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. సమావేశంలో కార్యదర్శి జి.నాగభూషణం, ఉపాధ్యక్షులు ఆకుల నూకరాజు, కోశాధికారి పి.రామకృష్ణారావు, డైరెక్టర్లు ఎ.వి.ఎస్.సత్యనారాయణ, డి.వి.నాగబాబు, ఇ. లోకేష్, ఎస్.భాను, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో తనిఖీలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీరాజుల నాయుడు, డీటీఎఫ్ సిబ్బందితోపాటు సెబ్ మహారాణిపేట స్టేషన్ అధికారులు కమిషనర్ ఆఫ్ పోలీస్, ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఎన్‌డీపీఎల్ లిక్కర్ అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. కాంప్లెక్స్‌తోపాటు పార్సిల్ కేంద్రాలు, పరిసరాల్లో తనిఖీలు చేశారు. పోలీసు సిబ్బందితోపాటు డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీల్లో పాల్గొంది.